
మా బాబ్జీకి ప్రతిరోజూ ఓ పుస్తకం పారేసుకోవటమో, చింపుకోవటమో, పలక బద్దలు కొట్టుకోవటమో జరుగుతూండేది. చదువు మొదలుపెట్టింది లగాయతు కొన్ని గ్రోసుల పలకపుల్లలు, వాటిలో సగం పెనిసిళ్లు ఖర్చయ్యాయి. కాగితాలకి కరువొచ్చినా మా వాడి నోట్సు పుస్తకాలకి మాత్రం లోటు రాకూడదు.

సంవత్సరాంతపు పరీక్షలు మొదలెట్టారు. వాటి లోటులేకుండా దిద్దటానికి పేపర్ల కట్టలొచ్చి పడుతున్నాయి. ఆ దినం ఉదయం ఖాళీగా వుండటం మూలాన్ని ఒక క్లాసు కట్టవిప్పి మార్కుల యజ్ఞం ప్రారంభించాను. పదిపేపర్లు పూర్తవగానే పొడుగు పంట్లామూ, పొట్టిచొక్కా తొడుక్కుని, నున్నగా తల దువ్వుకుని చేతులో అట్ట పట్టుకొని మా బాబ్జీ ప్రత్యక్షమయ్యాడు.




"ఇవాళ మా ఇంగ్లీషు పరీక్ష నాన్నగారూ" అన్నాడు.

"అలాగా బాగా చదివేవా అన్ని పాఠాలూనూ" అన్నా కళ్ళనున్న అద్దాలు తీస్తూ.

"చదివా".

"కానుక్కుతినటాని కర్థంకావాలా"

"ఒద్దు అమ్మ ఇడ్డెన్లు చేసింది. మీ కిప్పుడు తీసుకొస్తోంది కూడాను."

"కాపింగు పెనసలు చెక్కివ్వనా"

"అది కాదు నాన్నగారూ, వాళ్ళ విశ్వం పెన్నుతో పేపరు రాస్తాడు"

"అందుకే ఆ వెధవకెప్పుడూ తక్కువ మార్కులొస్తాయి".

"వాడికే యెప్పుడూ యెక్కువ మార్కులొస్తాయి నాన్నగారూ—పోయిన రెండూ పరీక్షల్లోనూ ఫస్టుమార్కు వాడిదే."

"ఒస్తే వస్తాయిలే, నువ్వు మాత్రం కాపింగు పెనిసిలుతో రాయి. నీ పెన్సిలు దస్తూరీ ఎంతో బాగుంటుందికూడాను."

"ఈ ఒక్క పేపరూ పెన్నుతో రాసి విశ్వం కంటె యెక్కువ మార్కులు తెచ్చుకుంటా, మీ పెన్నో మాటియ్యండి."

"నా పెన్నుతో నువ్వు రాయలేవు. అది నీకు రాయదుకూడాను. పరీక్షలో నిన్ను అవస్థ పెడుతుంది."

"అవస్థ పెట్టకుండా బాగానే రాస్తుంది నాన్నగారూ. మొన్న అమ్మ చాకలిపద్దు నా చేతే ఆ పెన్నుతోనే రాయించింది. అప్పుడా పెన్ను యెంతో బాగా రాసింది."

ఈ మాట వినేసరికి నాకు విచారమూ, కోపమూ ఒక్కమాటుగా వచ్చాయి. ప్రత్యేకంగా పద్య గద్య రచనలకోసమని పవిత్రంగా వాడుకుంటూన్న వజ్రాయుధంలాటి కలానికి చాకలిపద్దు, తేలుకులి పద్దు వ్రాసే గతిపట్టినందుకు విచారమూ, నాతో చెప్పకుండా నేను లేనప్పుడు మాతాపుత్రులు నా కలం తీసినందుకు కోపము, యేమైతేనేం, పరీక్షకి వెళ్ళే వాడిని గదిమితే చిన్నబుచ్చుకుని పరీక్ష పాడుచేస్తాడేమో అని మా బాబ్జీని గదమకుండా ఇలా అన్నా.

"మొన్న బాగానే రాసుండొచ్చు. ఇప్పుడందులో సిరా అయిపోయింది".

"అమ్మ పోసిస్తుంది నాన్నగారూ, జాగ్రత్తగా పట్టుకొస్తా," నేను తిరస్కారభావం చూపానని కళ్ళల్లోంచి కొంచెం నీళ్లు రాబోతున్నాయి. గుటకలు మింగుతూ నిలబడ్డాడు. వాడిని చూచేసరికి కొంచెం జాలివేసినమాట నిజమే. పెన్ను మీదుండే మమకారం పుత్రవాత్సల్యాన్ని జయించి నన్ను లోబర్చుకుంది. కళ్లజోడు తగిలించుకుని

పేపర్లు దిద్దటం మొదలెట్టా. అయిదు...పది... పదిహేనునిమిషాలు బాజ్జీ అలాగే నిలబడిపోయాడు. బొటనవేలుతో నేలరాస్తూ, గుటకలు మింగుతూ. మళ్ళీ ఓ మారు "ఏం...నాన్నగారూ" అన్నాడు.

"ఛీ వెధవా, పరీక్షకి టైమయిపోతోంది. వెళ్ళి పెన్సిలుతో పేపరు యేడు, నీ మొహానికి పెన్నుకూడా యెందుకు? ఇదివరకు తగలేసినవి చాలక నా" అన్నా కొంచెం హెచ్చుస్థాయిలో. తక్షణంగా యెదటనుంచి వెళ్ళిపోయాడు. వాన వెలిసిందనుకున్నా. కాని లోయర్ కోర్టు తీర్పు రద్దు చెయ్యమని అప్పీలు పిటీషను పడిందని అనుకోలేదు.

వెండికంచంలో ఒక అరడజను ఇడ్డెన్లు వాటికి కావలసిన ఇతరపదార్థాలు వాటి ప్రక్కనుంచి మంచినీళ్ళ చెంబుతో సహా తయారైంది మా బాజ్జీ అమ్మ.

"ఒక్కమాటివ్వండి పాపం చాలా సరదా పడుతున్నాడు. వాళ్ళ విశ్వంకూడా పెన్నుతో రాస్తున్నాట్ట" అంది పళ్లెం పక్కనున్న బల్లమీద పెడుతూ.

"సంతోషించాల్లే నీ రికమండేషనుకి. అందు కోసమే ఇందాకటినుంచీ కనిపెట్టుకున్నాను. వాళ్ళ విశ్వానికేం? వాడు పెద్దఅధికారి కొడుకు. అందు చేత వూళ్ళోవాళ్లవి, గుమాస్తాలవీ, అందరి పెన్నులూ వాడి జేబులోనే వుంటాయి నీకేం తెల్సు".

"మీకే తెల్సు మహాప్రపంచంలో! మీకు తెలిసినంత ఇంకెవ్వరికీ తెలియదు. అందుకే బడి పంతు లుద్యోగం చేస్తున్నారు" అంది మూతి రకరకాలుగా తిప్పుతూ చేతులు రెండూ, తలా ఆడిస్తూ.

'వాడు చదివేది అయిదో క్లాసాయె. పెన్నుతో రాసే సరదా వాడికి తీరకపోతుందా యేమిటి? పెన్ను పాడైతే యింకొకటి డబ్బిచ్చినా దొరకదు. పెనిసిళ్ళే దొరకటం లేదీరోజుల్లో.

'ఏంచోద్యంఅండీ మీకబుర్లూమీరూను. మీ మొహం చూచేప్పటికెవ్వరూ యేదీఅమ్మరుకాబోలు, ఆరునెల్లనుంచి పిల్లల గౌన్లకి పిన్నులు తెమ్మంటే లేవు, దొరకవన్నారు. ఎదరింటి రాజమ్మగారి మొగుడెళ్ళి యిట్టే పట్టుకొచ్చాడు రెండు డజన్లు. వాడికి టైమైపోతోంది పెన్నివ్వండి. అంతగా యేదేనా బ్రహ్మాండం బద్దలై ఆపెన్నుపోతే దానితాతలాటిది కొనుక్కోవచ్చులెండి. మీరివ్వకపోతే వాడు పరీక్ష పాడుచేసేలాగున్నాడు' అంది అతినిర్లక్ష్యంగా నియంతృత్వధోటితో. అనటమేతడువుగా, నా సమాధానంకోసం కనిపెట్టుకుని వుండకుండా, డ్రాయరు సొరుగులాగి పెన్నుతీసి గుమ్మంఅవతలున్న బాజ్జీకి దాన్నిచ్చి వాడినిపంపించి, ఒక్కమాటు నా భుజం తట్టి ఒకరకపునవ్వు నవ్వి వెళ్ళిపోయింది. అప్పటికి పళ్ళెంలో యింకా రెండున్నర ఇడ్డెన్లు మిగిలాయి. అవి చాలా బాగున్నా యిహ తినబుద్ధవలేదు. చెయ్యి కడుక్కుని పళ్ళెం కిందపెట్టేశా.

పేపర్లు దిద్దుతూన్నంతసేపూ దృష్టి నా కలం మీదే. అనేక ఆలోచనలు. బాజ్జీ రాస్తూంటే కిందపడిపోయిందనొకమాటూ, పాళీ చీలికలు ఒకదాని మీద ఒకటెక్కిందని యింకొకమాటూ, వాడురాస్తూ కిందపెడితే పక్కకుర్రాడు తొక్కేశాడని ఒకమాటూ, వాడిజేబుకి చిల్లుంటే అందులోంచి జారి క్రిందపడిపోయిందని ఒకమాటూ...ఇలాగ పరిపరి విధాల పోయాయి ఆలోచన్లు. ఆ పెన్నంటే నాకు చాలా యిష్టం. అదొచ్చిన తరవాతే నేను అయిదు ఛాన్సుల తరవాత బి.యే. పరీక్ష పేసవటం, వుద్యో

కథాంజలి
అన్ని హిగ్గిన్ బాథమ్సు బుక్ స్టాల్సు
లోను దొరకును. వెల 0-2-0

గం చెయ్యటం, వ్యాసకర్తనని పేరు తెచ్చుకోవటం జరిగాయి. అందుచేత అది అచ్చొచ్చిన కలం!

అదేం చిత్రమో ఆ పేపర్లసలు గంటకి యెనిమిది తక్కువ కాకుండా దిద్దేవాడిని. అలాంటిది గంటకి రెండు పేపర్లేనా అవలేదు. ఆ సమయంలో దిద్దిన పేపర్లకి తక్కువ మార్కులు కూడా పడ్డాయి.

మరొక గంటలో మా బాజ్జీ ఎగిరిగంతేస్తూ ఒచ్చి, 'నాన్నగారోయ్, నాదే ఫస్టుమార్కు. నాకు యెనభై, విశ్వానికి డెభ్భై మార్కులు. పేపర్లక్కడే దిద్దేశారు మేష్టారు' అన్నాడు. వాడి వెనకాలే ఒచ్చినతల్లి మందహాసం, ఆనందం వర్ణనలవి కాదు.

'అయితే పెన్నేదిరా, బాజ్జీ' అన్నా.

'ఇదుగో నాన్నగారూ,' అంటూ పంట్లాం జేబులో చెయ్యిపెట్టి పైకిలాగాడు. పెన్ను టోపీ వూడొచ్చింది. అసలది లేదు. కంగారుతో వెంటనే కుర్చీలోనుంచిలేచి వాడి పంట్లాంజేబు వెతికా. ఏముంది? పంట్లాంజేబుకి చిల్లు! కలానికి కాళ్ళొచ్చాయి.

'చూశావా నీ సుపుత్రుడి తెలివితేటలు? నే చెపితే విన్నావా?'

'ఆఁ పోనిద్దురూ. ఫస్టుమార్కు వాడిదేట. కుర్రకుంక. మీ చిన్నప్పుడు మీకుకూడా మీ నాన్నగారి పార్కరుపెన్ను పారేశారుట' అంది చీమ కుట్టినంతేనా బాధపడకుండానూ, పైగా వికటంగా నవ్వుతూను.





నేషనల్ ఫ్లవర్ డస్ట్

చిరకాలం పరిమళాన్ని నిలుపగల మధుర సువాసన ద్రవ్యం

మన మాతృభూమి భారతదేశంలో లభ్యమయ్యే సుగంధద్రవ్యాలతో తయారుచెయ్యబడినది. ఈ 'నేషనల్ ఫ్లవర్ డస్ట్' కొన్ని పాకెట్లుకొని, డ్రాయర్లలోను, బీరువాలలోను, పెట్టెలలోను వుంచండి. దుస్తులను చిమ్మటలు తినివేయకుండా, బూజుపట్టకుండా కాపాడుతుంది. శయ్యాగృహాలలో-మందిరాలలో-రైళ్లలో ప్రయాణంచేస్తున్నపుడు-ఖండాంతర పర్యటన జరుపుతున్నపుడు దీనిని దగ్గర వుంచుకొంటే నవోత్సాహాన్ని ఇస్తూవుంటుంది. అందరూ ఉపయోగించదగినది.

హెచ్చరిక { 'నేషనల్ ఫ్లవర్ డస్ట్' వాసన చెడకుండా ఒక ప్రత్యేకమైన కాగితముతో చెయ్యబడిన ఈ కాగితపు సంచీలను చించివేయకండి.

ఎం. ఖాదర్ సాహెబ్ అండు సన్స్,
మాన్యుఫాక్చరింగ్ పెర్ఫ్యూమర్స్ : : మధుర.

మద్రాసు స్టాకిస్టులు:

రవి & కో., 53, బందరువీధి, జి. టి. మద్రాసు.